ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్ 2025 5 అనంతపురం





యోగాసనాలు వేస్తున్న దివ్యాంగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు



పొలిటికల్ ఫై(హీ)ట్..!

◆ మూడు నియోజకవర్గాల్లో పరస్పర ఆరోపణలు

◆ రాజుకుంటున్న రాజకీయ వేడి



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పొలిటికల్ ఫైట్ హీట్ నడుస్తోంది. రాప్తాడు, తాడిపత్రి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధమే కాకుండా చేతల వరకు పరిస్థితులు దారితీస్తున్నాయి. నేతల మధ్య పరస్పరం దాడుల హెచ్చరికలు కొనసాగుతుండటం గమనార్హం.

రాప్తాడులో రాజకీయ రచ్చ

ముందు నుంచి రాప్తాడు నియోజకవర్గం సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. గత కొంతకాలంగా రాజకీయ రచ్చ మరింత పెరిగింది. రామగిరి ఎంపిపి ఉప ఎన్నిక నుంచి ఇది తారా స్థాయికి చేరింది. ఎంపిపి స్థానానికి ఎలాగైన దక్కించుకోవాలని అధికార టిడిపి ప్రయత్నించింది. దీన్ని తిప్పికొట్టే క్రమంలో వైసిపి గట్టిగానే నిలబడింది. దీంతో ఈ విషయంలో రెండు గ్రూపుల మధ్య వివాదం నడుస్తోంది. అంతలోనే పాపిరెడ్డిపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్త హత్య జరిగింది. ఈ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఆ సమయంలో హెలికాప్టర్ వద్ద గందరగోళం నెలకొంది. ఇది కేసుల వరకు వెళ్లింది. ఇప్పటికీ దీనిపై విచారణ కొనసాగుతోంది. ఇది ముగియకముందే రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ బాలిక అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపైనా వైసిపి ఆందోళనలు చేపట్టడం, ఆ గ్రామానికి వెళ్లేందుకు మాజీ మంత్రి మెరుగ నాగార్జున, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రయత్నించారు. ఈ విషయంలోనూ ప్రకాశ్‌రెడ్డిపై మరో కేసు నమోదయింది. ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఆయన దాని నుంచి తప్పించుకునేందుకు అజ్ఞాతంలోకి వెళ్లారు.

తాడిపత్రిలో ఆది నుంచి హైటెన్షన్..!

తాడిపత్రిలో ఎన్నికల ప్రక్రియ ముగిసినప్పటి నుంచి హైటెన్షన్ వాతావరణమే నెలకొంది. వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో వస్తే దాడి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కూడా అనుమతి నిరాకరించడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానంలో తగిన భద్రత కల్పించి తాడిపత్రిలోకి అనుమతించాలని నిర్దేశించింది. ప్రభాకర్‌రెడ్డి మాత్రం వస్తే దాడి జరిగే అవకాశముందని చెబుతుండటంతో పోలీసులు అనుమతించడానికి వెనుకాడుతున్నారు. తాజాగా శనివారం కూడా పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే ప్రయత్నం చేస్తే పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వస్తే ఏమవుతుందోనన్న టెన్షన్ తాడిపత్రి ప్రజల్లో నెలకొంది.

పుట్టపర్తిలో పల్లె చుట్టూ భూ వివాదం

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి సంబంధించి కూటమి నేత ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ భూ వివాదం తారా స్థాయిలో జరుగుతోంది. పెనుకొండ కియా పరిశ్రమ వద్ద భాగస్వామ్యంలో కొన్న 200 ఎకరాల్లో వివాదం నెలకొంది. గడిచిన ఐదారేళ్లుగా ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఇది తారా స్థాయికి చేరింది. పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఇలా మూడు నియోజకవర్గాల్లో రాజకీయ వేడి తారా స్థాయికి చేరింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

◆ 'అనంత'లో దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం

◆ పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలియజేశారు. శనివారం ఉదయం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దివ్యాంగులు, పింఛన్ దారులు, వృద్ధులు ఏ విధంగా యోగా చేయాలన్న దానిపై యోగా మాస్టర్లు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను రోజు పాటిస్తే అనారోగ్య సమస్యలు ఉండవన్నారు. దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమాన్ని అనంతపురంలో ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 21న వరల్డ్ రికార్డ్‌లో భాగంగా యోగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మన వైపు చూసేలా ఈరోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈనెల 21వ తేదీన ఆర్డీటీ స్టేడియంలో దాదాపు 5,000 మందితో యోగాడేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ యోతో శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఉత్తేజం, ఉల్లాసం లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, డిఆర్ఒ ఎ.మాలోల, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, ఆర్డీవో కేశవనాయుడు, డిఆర్‌డిఎ పీడీ, సమగ్ర శిక్ష ఏపీసి శైలజతో పాటు వివిధ శాఖల అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ప్రాణాలను నిలిపే రక్తదానం

ఐఆర్‌సిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవ వేడుకలు



ప్లేట్‌లెట్ అజిటేటర్, ఇంక్యుబేటర్‌లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో గుత్తా కేశవనాయుడు, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రమాదాలు, ఇతర సమయాల్లో రక్తదానం ఎదుట వారి ప్రాణాలను కాపాడు తుందని పలువురు తెలియజేశారు. అనంత పురం పాతూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సిఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వివిధ సేవా సంస్థలు, రక్తదాన శిబిరాల నిర్వాహకుల సేవలను గుర్తించి సన్మానించారు. ఆర్డీవో గుత్తా కేశవ నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదాతలను సన్మానించారు. ముందుగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సిఎస్ఆర్ సహాయంతో కొనుగోలు చేసిన ప్లేట్‌లెట్ అజిటేటర్, ఇంక్యుబేటర్‌లను ఆవిష్కరించారు. మోబిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అందించిన పరికరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఆర్ఎస్ ఛైర్‌పర్సన్ కాపు భారతి మాట్లాడుతూ రక్తదానం సేవల్లో ఐఆర్ఎస్ అనంతపురం రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో ఉందన్నారు. అందరి సహకారంతో మొదటి స్థానం సాధిస్తామని చెప్పారు. ఆర్డీవో కేశవ నాయుడు మాట్లాడుతూ తాను విద్యార్థి దశ నుంచి సేవా కార్యక్రమాలు, రక్తదానంలో పాల్గొంటున్నానని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సుందర రాజు, వైస్ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణ ప్రసాద తదితరులు పాల్గొన్నారు.



పెద్దారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

పెద్దారెడ్డికి మళ్లీ బ్రేక్

తాడిపత్రికి వెళ్లకుండా అడ్డగింత

పోలీసుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-యల్లనూరు

తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మరోసారి పోలీసులు బ్రేక్ వేశారు. హైకోర్టు అనుమతితో పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా శాంతిభద్రతల నేపథ్యంలో ఆయన్ను అడ్డుకుంటున్నారు. శనివారం ఉదయం యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. ఈ సమయంలో పోలీసులపై పెద్దారెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని, అయినా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పోలీసులు జెసి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలను పాటిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భయంతోనే అడ్డగింత : పెద్దారెడ్డి

తాను తాడిపత్రికి వెళ్తే జెసి.ప్రభాకర్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ఉండదని కారణంతో పోలీసుల చేత తనను పదేపదే అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి తెలిపారు. గృహ నిర్బంధం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి తనను తాడిపత్రికి రానీయకుండా తన అనచరులను రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. శాంతి భద్రతలకు విఘాతం ఎవరు విఘాతం కలిగిస్తున్నారో పోలీసులకు బాగా తెలుసన్నారు. చట్టాన్ని తాను గౌరవిస్తున్నాను కాబట్టే ప్రతి సారి పోలీసులు చెప్పినట్లు వింటున్నానని తెలిపారు.

గూగూడులో కనిపించని అభివృద్ధి

ఎక్కడి సమస్యలు అక్కడే.. - 27 నుంచి కుళ్లాయిస్వామి ఉత్సవాలు



గూగూడులోని జంట ఆలయాలు



మురికినీటితో కోనేరు

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలోనే మత సామరస్యానికి ప్రతీకగా నిలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రంలో ఎక్కడి సమస్యలు అక్కడ దర్శనమిస్తున్నాయి. ఈనెల 27వతేదీ నుంచి కుళ్లాయిస్వామి బ్రహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దాదాపు పది రోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఉత్సవాలకు జిల్లాతో పాటు రాష్ట్రం, ఇతర రాష్ట్రా నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈనేపథ్యంలో గూగూడు అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే అన్నచందంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భక్తులు తలనీలాలు సమర్పించే కళ్యాణ కట్ట వద్ద విపరీతమైన అపరిశుభ్రత నెలకొంది. మరోవైపు భక్తులు స్నానమాచరించే కోనేరు మురినీటితో దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు గ్రామంలో ఇరుకు సందులతో నానా ఇక్కట్లు పడతారు. ఈ సందుల్లో ఒక వాహనం వచ్చిందంటే మరోవాహనం వెళ్లదు.

ప్రతి ఏడాది కుళ్లాయిస్వామి ఉత్సవాలను మొదలుకుని ఏడాది మొత్తం భక్తులు సమర్పించే కానుకల ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం వస్తోంది. ఈ నిధులను అభివృద్ధికి ఉపయోగించినా గూగూడులో సమస్యలు ఉండవని భక్తులు అంటున్నారు. కొన్ని దశాబ్ధాల కాలం నుంచి పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నారు తప్ప అభివృద్ధి చేసిన పాపాన పోలేదని విమర్శిస్తున్నారు. మరోవైపు గూగూడు గ్రామాన్ని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అప్పట్లో తమ గ్రామం రూపురేఖలు మారుతాయని అందరూ భావించారు. అయితే చేసింది మాత్రం శూన్యమని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారులు స్పందించి గూగూడులో భక్తులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

మద్యం అమ్మకాలు ఆపండి..

కుళ్లాయిస్వామి ఉత్సవాల సమయంలో గూగూడు గ్రామంలో మద్యం అమ్మకాలు ఆపాలని భక్తులు కోరుతున్నారు. మద్యం అమ్మకాలు కొనసాగడం వల్ల కొందరు అతిగా మద్యం తాగి ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. కావున గూగూడులో మద్యం అమ్మకాలను ఆపాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న కళ్యాణ కట్ట

ఎమ్మెల్యే దగ్గుపాటి నోరు విప్పితే అబద్ధాలే..

మేయర్ మహమ్మద్ వసీం



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నోరు విప్పితే పదే పదే అబద్ధాలు చెపుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి నేతలు యేడాది పాలన సంబరాలు చేసుకుంటున్న నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన 143 హామీల్లో ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. ఇందులో భాగమే జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసులు అన్నారు. ఈయన కేసులో సుప్రీంకోర్టులో కూటమి నేతలకు చెంపపెట్టులా తగలి న్యాయం గెలిచిందన్నారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి రూ.2వేలు పాఠశాల అవసరాలకు తీసుకుంటే గగ్గోలు పెట్టిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ నేడు తల్లికి వందనంలో రూ.2వేలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇకపోతే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ 15నెలల ముందు ఇక్కడికి వచ్చి గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మున్సిపల్ నిధులు కాకుండా కేంద్ర, రాష్ట్ర నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా సోములదొడ్డి నుంచి పాతూరు వరకూ గుత్తి రోడ్డు నాలుగు రహదారులు, జెఎన్‌టియు రోడ్డు నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రోడ్డు, బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకూ నాలుగు వరుసల రోడ్డు చేశారన్నారు. అయితే ఆయా రోడ్లను తామే చేసినట్లు దగ్గుపాటి చెప్పుకునేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. మీరు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పుకోవాలేగానీ, మీ మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. వైసిపి హయాంలోనే రుద్రంపేట నుంచి పివికెకె కళాశాల వరకూ 80 శాతం పనులు పూరక్తయ్యాయన్నారు. నారాయణపురం బ్రిడ్జి పనులను మాజీ ఎమ్మెల్యే అనంత ప్రారంభిస్తే మళ్లీ మంత్రులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి భూమిపూజ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డ్ క్లియర్ చేయాలని, ప్రొటాక్షన్ వాల్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వంటి హామీలను అమలు చేయాలని సూచించారు. వైసిపి పాలనలో నగరం ప్రశాంతంగా ఉండేదన్నారు. అయితే నేడు కూటమి నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని అరచకాలు,దౌర్జన్యాలు, కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్లు నరసింహులు, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, రహంతుల్లా, సంపంగి రామాంజినేయులు, అనిల్‌కుమార్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శంషుద్దీన్, నాయకులు రామచంద్ర, రియాజ్, కాకర్ల శీనా, దాదు, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీలూరు పులుసువంక కల్వర్టు

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని నీలూరు గ్రామంలో పొలాలకు వెళే దారిలో పులుసువంక కల్వర్టు గత వర్షాలకు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. కల్వర్టుపై బండలు వేసి ఉండటంతో బాటసారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కల్వర్టు మీదుగా వెళ్లే పొలాలు దాదాపు 250 ఎకరాల భూమి సాగులో ఉంది. ఆయా భూములకు వెళ్లేందుకు నిత్యం ఎద్దుల బండ్లు, ద్విచక్ర వాహనాల్లో రైతులకు వెళ్తుంటారు. ఈ క్రమంలో కల్వర్టుపై బండలు ఉండటంతో చక్రాలు అందులో ఇరుక్కుని ప్రమాదాలకు గురవుతున్నామని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టును తొలగించి నూతన కల్వర్టును ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులందరికీ ఒకే జాయినింగ్ తేదీని కేటాయించాలి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డీఎస్సీ 2012లో ఎంపికైన ఉపాధ్యాయులందరికీ ఒకే జాయినింగ్ తేదీని కేటాయించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు కోరారు. ఈమేరకు అనంతపురంలోని ఆర్డీటీ ఆడిటోరియం వద్ద శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్పకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ 2012 సుమారు 250 మంది ఎస్‌జిటిలుగా ఎంపికై అనంతపురం జిల్లా పరిధిలోని వివిధ మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో నియామకం పొందారన్నారు. అయితే జిల్లా పరిధిలో ఉన్న ఒక్కొక్క మున్సిపాలిటీలో వీరిని వేరేవేరే తేదీల్లో జాయినింగ్ చేసుకున్నారన్నారు. దీనివల్ల ఉపాధ్యాయుల బదిలీ చట్టాన్ని అనుసరించి చేపట్టిన బదిలీల్లో జాయినింగ్ తేదీలు వేర్వేరుగా ఉండడంతో బదిలీ పాయింట్ల విషయంలో అసంబద్ధత ఏర్పడుతోందన్నారు. దీని మూలంగా డీఎస్సీ మెరిట్‌లో 1,2 ర్యాంక్‌లో ఉన్న ఉపాధ్యాయులు సైతం 60 ర్యాంకుల తర్వాత ఉంటూ నష్టపోతున్నారన్నారు. కావున ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, రాష్ట్ర అడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.గోవిందరాజులు, సి.లింగమయ్య, సీనియర్ నాయకులు కోటేశ్వరప్ప, కె.నాగేంద్ర, ధర్మవరం పట్టణ శాఖ నాయకులు హెచ్.రామాంజనేయులు, సాయిగణేష్, 70 మంది మున్సిపాలిటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన వైద్యురాలికి మెమో

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని బొమ్మనహాల్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు గైర్హాజరైన డాక్టర్ శ్రీలక్ష్మికి డ్రాయింగ్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్ శనివారం మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు, అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులకు సేవలు అందించాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందన్నారు. అలా విధులకు హాజరు కాకుండా రోగులు, సిబ్బంది ఫోన్ చేసినా స్పందించలేదని ఫిర్యాదు రావడంతో పరిశీలించి మెమో జారీ చేసినట్లు తెలిపారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

భాష్యం విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్య ముసుగులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి రూ.లక్షలు దండుకుంటున్న భాష్యం విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని భాష్యం పాఠశాల ఎదుట వైఎస్ఆర్ఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌నాయక్, అధ్యక్షులు అక్షయ్ మాట్లాడుతూ పట్టణంలోని భాష్యం విద్యాసంస్థ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతూ రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనికితోడు మాయమాటలు చెప్పి రూ.లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజుల దోపిడీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు వాల్మీకి సాయి, మణికంఠ, సహాయ కార్యదర్శి పవన్, పట్టణ నాయకులు శ్యాంసుందర్, లోకేష్, అబ్దుల్, ఎన్ఎస్‌యుఐ నాయకులు ప్రవంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అఘాయిత్యంపై ఆందోళన..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ వారంలో అమ్మాయిలపై జరిగిన అఘాయిత్యం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇదే ప్రధానమైన అంశంగా ముందుకొచ్చింది. అటు అధికారి, విపక్ష పార్టీలు రెండూ ఈ సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాయి. సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో ఒక మైనర్ బాలికను రెండేళ్లుగా అత్యాచారానికి పాల్పడిన ఘటన బయటకొచ్చింది. ఏకంగా 16 మంది బాలికను భయపెట్టి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్టు పోలీసు విచారణలో తేలడంతో వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారు. ఈ చర్చ నడుస్తున్న క్రమంలోనే అనంతపురం నగరంలో యువతి పెళ్లి చేసుకొమ్మన్నందుకు బండరాయితో మోది హత్య చేసిన ఘటన బయటకొచ్చింది. నాలుగు రోజుల క్రితం అమ్మాయి తప్పోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో ఈ ఘాతుకం జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో సిఐ రాజేంద్రనాథ్‌ను పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ రెండు ఘటనలు వరుసగా చోటు చేసుకోవడంతో మహిళల భద్రతపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. మహిళలపై జరిగిన దాడులను పరిశీలించేందుకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ విచ్చేశారు. బాధితులను కలసి పరామర్శించి వెళ్లారు. సిపిఎం ఆధ్వర్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసనలు కొనసాగాయి. ఇక వైసిపి కూడా ప్రభుత్వ వైఫల్యం అంటూ పెద్దఎత్తున నిరసనలకు దిగింది. అనంతపురం నగరంలో ర్యాలీలు నిర్వహించగా, ఏడుగుర్రాలపల్లికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మాజీ మంత్రి మెరుగ నాగార్జున, సాకే శైలజాథ్, ఉషచరణ్ శ్రీ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిలు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని వారిని మధ్యలోనే అరెస్టు చేసి వెనక్కు పంపించారు. ఈ రెండు ఘటనలు వరుసగా జరగడంతో రాష్ట్ర వ్యాప్తంగానూ ఈ అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది.


ఈ వారంలో వర్షాలు పడటం ఖరీఫ్ సాగుకు కొంత సానుకూలంగా మారింది. జూన్ ప్రారంభం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు మే ఆఖరిలో పడినంతగా, జూన్ ఆరంభంలో పడలేదు. రెండవ వారంలో ఒక మోస్తరు వర్షపాతం జిల్లా వ్యాప్తంగా నమోదయింది. దీంతో సాగుకు రైతులు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నాయి. వేరుశనగ సబ్సిడీ విత్తన పంపిణీ కూడా ఆరంభమైంది. రైతులు పెద్దగా వేరుశనగ విత్తన కొనుగోలుకు ఆసక్తి చూపకపోవడం శోచనీయం. ఆముదం, జొన్న, మొక్కజొన్న, కంది పంటల వైపు ఎక్కువగా మొగ్గు చూపే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం తల్లికివందన పేరుతో విద్యా కానుక డబ్బులను తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దీని కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తూ వచ్చారు. ఇప్పుడు ఖాతాల్లోకి డబ్బులు పడటంతో ఒకింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ సమస్యలున్నా ఈ నెలాఖరులోపు వాటిని పరిష్కరించుకుంటే వారికి కూడా డబ్బులు పడతాయని విద్యా శాఖ చెప్పడంతో రాని వారు వాటిని సరిచేసుకునే పనిలో పడ్డారు. ఇక ఖరీఫ్ సీజన్ ఆరంభంలో ఇచ్చే రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. అది కూడా ఈ నెలలోనే వేస్తామని మహానాడు సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అది కూడా వస్తే ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు కొంత చేదోడు అయ్యే అవకాశముంది.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



పెద్దపప్పూరు : నీట్ పరీక్ష ఫలితాల్లో మండలానికి చెందిన నీషితారెడ్డి 7,253 ర్యాంకు సాధించింది. మండలంలోని పెద్దయక్కలూరు గ్రామానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి, వరలక్ష్మి దంపతుల కూతురు నిషితారెడ్డి విజయవాడ శ్రీచైతన్యలో చదువుతోంది. ఈనేపథ్యంలో నీట్‌లో ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల వారికి స్వీట్లు పంపిణీ చేశారు.



పామిడి : మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన టిడిపి మండల నాయకులు పెరమసాని రామాంజనేయులు, రమాదేవిల కూతురు హరిత నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. 547 మార్కులు సాధించి ఆలిండియాలో 13,067వ ర్యాంకు సాధించింది. దీంతో గ్రామస్తులు అమ్మాయికి అభినందనలు తెలిపారు.



కళ్యాణదుర్గం రూరల్ : ఇటీవల జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టులో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన యువకుడు ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన ప్రతి డైలీ న్యూస్ ఎడిటర్ దాసరి సతీష్‌కుమార్, అర్చన కుమారుడు చిన్మయ్ చాణిక్య 560 మార్కులు వచ్చి అలిండియా ర్యాంక్ 8,492 సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు సంబరాలు చేసుకున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు, టిడిపి నాయకులు

పుట్లూరు : తల్లుల బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ కావడాన్ని హర్షిస్తూ మండల పరిధిలోని కడవకల్లు, చింతలపల్లి గ్రామాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి టిడిపి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గోవర్ధన రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒకరికి మాత్రమే అమ్మఒడి పథకం ఇచ్చేవారన్నారు. అయితే ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంతమంది పిల్లల ఉన్నా వారందరికీ తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి తల్లి ఖాతాలకు రూ.13వేల చొప్పున జమ చేసినట్లు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గుత్తి : పట్టణంలోని పెన్షనర్ల భవనంలో శనివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నంద్యాలలోని శాంతిరామ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 130 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబుబకార్, అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు, పెన్షనర్ల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం


విలపిస్తున్న తల్లి ఖుషీదమ్మ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

స్నేహితులు కలిసి వెళ్లిన విహార యాత్ర విషాదాన్ని మిగిల్చింది. విహారయాత్రలో దైవదర్శనంతోపాటు అహ్లాదమైన ప్రాంతాలను సందర్శిద్దామని సంబరపడ్డారు. వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా విహారయాత్ర విషయం చెప్పుకుని ఒప్పించి సిద్ధమయ్యారు. అనుకున్న విధంగానే పట్టణానికి చెందిన సుమారు 26 మంది స్నేహితులు తిరుమల దైవ దర్శనానికి శుక్రవారం బయలుదేరారు. శనివారం ఉదయం తిరుపతికి చేరుకుని స్నానాలు చేసి తిరుమలకు శ్రీవారి మెట్లపై కాలినడకన బయలుదేరారు. గాలిగోపురం సమీపంలోకి చేరుకోగానే జాఫర్ (28) గుండెపోటుకు గురయ్యాడు. కొందరు స్నేహితులు దూరంలో ఉండగా పక్కనే ఒక స్నేహితుడు షేక్షా కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విషాద ఘటనతో అందరూ జాఫర్ మృతదేహంతో కళ్యాణదుర్గానికి బయలుదేరారు.

తిరుమల మెట్లమార్గంలో గుండెపోటుతో యువకుడు మృతి


జాఫర్ (ఫైల్)

పట్టణంలోని 23వ వార్డులో నివాసముంటున్న సుమారు 26 మంది యువకులు శుక్రవారం కళ్యాణదుర్గం నుంచి కొంత మంది కదిరిదేవరపల్లి నుంచి బయలుదేరే రైలు ఎక్కారు. మరి కొంతమంది బస్సులో వెళ్లి అదేరైలులో అనంతపురంలో ఎక్కారు. అందరూ శనివారం ఉదయాన్నే తిరుపతిలో దిగారు. స్నేహితుల్లో ఒకరైన షేక్షా షాజాదీ ఉదయాన్నే ఫోన్ చేయగా తిరుమలకు మెట్లపై బయలుదేరుతున్నామని చెప్పారు. మరోసారి మధ్యలో ఫోన్‌లో పలకరించగా అప్పుడే గాలిగోపురం సమీపంలో ఉన్నామని సమాధానమిచ్చాడు. 10 నిమిషాలకు తిరిగి ఫోన్ చేసి జాఫర్ గుండెపోటుతో చనిపోయాడని చెప్పడంతో తల్లి షాజాదీకి మాటలు రాలేని పరిస్థితి.

సొమ్మసిల్లి పడిపోయిన తల్లిదండ్రులు

కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు దూదేకుల నాగరాజు, తల్లి ఖుషీదమ్మ సొమ్మసిల్లి పడిపోయారు. కుటుంబ పోషణలో చెదోడువాదోడుగా ఉండే కుమారుడి మరణంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.


వృద్ధురాలి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

గ్రామసభలతో సమగ్రాభివృద్ధి : ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామసభలతో పంచాయతీలు సమగ్రాభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రావులోడికి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత వైసిపి హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి అభివృద్ధిని గాడిలో పెట్టామన్నారు. ఇందులో భాగంగానే గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ బరన్ సాహెబ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రక్తదాతలకు సన్మానం

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్, రక్తదాతల సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ గులాం మహమ్మద్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రక్తదానంపై అవగాహన కల్పించారు. అనంతరం రెడ్‌డ్రాప్ ఫౌండర్ రెహమాన్, ప్రెసిడెంట్ గులాం మహమ్మద్, లెజెండ్ అధ్యక్షుడు రంజాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ గౌరవాధ్యక్షులు ఇస్మాయిల్, వైద్యులు జయవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ ప్రజ్ఞ పవిత్ర, మల్లికార్జున, డెర్మటాలజీ ఆల్మస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రక్తదాతల దినోత్సవం సందర్భంగా సప్తగిరి మల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లి శనివారం అనంతపురంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానం చేయడంపై అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్య పరిచినందుకు గుర్తింపుగా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ కాపు భారతి అవార్డును అందజేశారు.

కళ్యాణదుర్గం టౌన్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గం ప్రజాశక్తి విలేకరి రఘును శనివారం జిల్లాకేంద్రంలోని ఆదరణ సేవాసమాజ్ ట్రస్టు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రఘు 29 సార్లు రక్తదానం చేసినందుకు సన్మానం లభించింది. దీంతో మానవతా కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, కో కన్వీనర్ సలీమ్‌మాలిక్, మమతా కన్వీనర్ నవీన్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకులు రెహమాన్, తదితరులు రఘును ఘనంగా సత్కరించారు.

కళ్యాణదుర్గానికి చెందిన రక్తదాతల ఫౌండర్ కంబాల తిమ్మారెడ్డికి అవార్డు లభించింది. ఈమేరకు శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్‌పర్సన్ కాపు భారతి ఆధ్వర్యంలో తిమ్మారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుత్తి : రక్తదాతలు చేస్తున్న నిస్వార్థ సేవలు వెలకట్టలేనివని వక్తలు అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం శనివారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో గుత్తి పోలీస్‌స్టేషన్‌లో 30 సార్లు రక్తదానం చేసిన కానిస్టేబుల్ శివశంకర్, రెడ్ ప్లస్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్షావలి, మహబూబ్ పీరా, సాయి మున్నా, ఆటో డ్రైవర్ షేక్ నజీర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ సయ్యద్ ఆశాబేగం, హెడ్ కానిస్టేబుల్ రమేష్ నాయక్, కానిస్టేబుల్ భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ శ్రీవాణిని రెవెన్యూ డివిజనల్ అధికారి గుత్తా కేశవ నాయుడు సత్కరించి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న ప్రజాశక్తి విలేకరి రఘు

అక్రమంగా ఇసుక తరలిస్తే జైలుకే.. : సిఐ


నిదనవాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

ప్రజాశక్తి-శింగనమల

మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే జైలుకు పంపుతామని సిఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. మండలంలోని నిదనవాడ సమీపంలో ఉన్న పెన్నా నది పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో రైతులు శుక్రవారం అడ్డుకున్న విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన సిఐ కౌలుట్లయ్య సిబ్బందితో వెళ్లి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెన్నానది పరీవాహక ప్రాంతంలో ఇసుక తరలించడం వల్ల ఇప్పటికే నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిదనవాడ రైతన్నలు సిఐ దృష్టికి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో ఇసుక తరలిస్తే బోరుబావుల్లో నీరు పూర్తిగా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామ సమీపంలో ప్రభుత్వం ఇసుక రీచ్‌ని ఏర్పాటు చేసిందన్నారు. అక్కడ నుంచి మాత్రమే ఇసుక తరలించుకోవాలన్నారు. శింగనమల మండల పరిధిలోని నిదనవాడ ప్రాంతం వైపు ఇసుక తరలించకూడదన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక తరలిస్తే మైన్స్ అండ్ జియాలజీ శాఖ లేదా రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, నిదనవాడ ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సౌందర్యాత్మక విమర్శకుడు రాజారామ్

రచయిత శాంతినారాయణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వస్తు దృష్టితో కాకుండా సౌందర్యాత్మక దృష్టితో రచనలు చేసే కవి తూముచర్ల రాజారామ్ సౌందర్యాత్మక విమర్శకుడు అని రచయిత శాంతినారాయణ కొనియాడారు. రాజారామ్ రచించిన 'తేనె పూల మీద తుమ్మెద' కవితాంతరంగ పరామర్శ వ్యాసాల సంపుటిని నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజారామ్ గంపలకొద్దీ కవిత్వాన్ని మన తలపై ఉంచారు, దానిని అధ్యయనం చేయడం సాహితీవేత్తల బాధ్యత అని పేర్కొన్నారు. నక్షత్ర మాలికలా 27 మంది కవుల కవిత్వాలను విశ్లేషించిన రాజారామ్ గ్రంథం కవిత్వాన్ని అనుభవించే దిశగా దారి చూపే సైన్ బోర్డులా విశిష్టంగా ఉందని ప్రముఖ ఉపన్యాసకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు జివిఎల్ఎన్‌ప్రసాద్ తెలిపారు. సాహితీ లోకానికి అంతగా పరిచయం లేని కవుల కవిత్వాలను చదివి, అనుభవించి వాటి సారాన్ని 'తేనె పూల మీది తుమ్మెద'లా అనంత సాహితీ లోకానికి పరిచయం చేసిన రాజారామ్ కృషి అభినందనీయమని 'స్పందన' అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర శాస్త్రి అభిప్రాయపడ్డారు. అనంతరం రాజారామ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ కరస్పాండెంట్ వేలూరి జయచంద్ర దంపతులు, ఆవిష్కర్త జయచంద్ర, అంకే శ్రీనివాస్, డా.రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, తరిమెల అమరనాథరెడ్డి, జయరామప్ప, జిరసం అధ్యక్షులు సురేష్, కథకుడు రాయుడు, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, ప్రజ్ఞా సురేష్, జూటూరి షరీఫ్, టివి రెడ్డి, కంబన్న, వన్నప్ప, మధురశ్రీ, నాగలింగయ్య, బోస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు వాడకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న దృశ్యం

పామిడి : మండల కేంద్రంలోని సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు వాడకంపై శనివారం శిక్షణ ఇచ్చారు. స్థానికసరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో నాలుగు ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా బోర్డుల్లో విద్యార్థులకు ఎలా బోధించాలనే విషయాలపై శిక్షణ ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు.

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎమ్మెల్యే తనయుడు యశ్వంత్‌చౌదరి

కళ్యాణదుర్గం టౌన్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు రెడ్‌క్రాస్ సొసైటీ పురస్కారం అందజేసింది. సురేంద్రబాబుకు సంబంధించిన ఎస్ఆర్‌సి ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కరోజులోనే ఎక్కువ యునిట్లు రక్తదానం చేయించడంతో రెడ్‌క్రాస్ సోసైటీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా భాగంగా శనివారం గుంటూరులో రెడ్‌క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు యశ్వంత్‌చౌదరి పురస్కారాన్ని అందుకున్నారు.

శేషతల్ప అలంకారంలో అవధూత ఎర్రితాత



బెలుగుప్ప : మండల కేంద్రంలోని శాంతిధామంలో వెలిసిన అవధూత ఎర్రితాత ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఎర్రితాత ఉదయం ఎర్రితాతకు అభిషేకాలు, బిల్వార్చన, పల్లికిసేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి అర్చనలు చేసిన అనంతరం శేషతల్ప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి ఎద్దుల బండిలో రథోత్సవం నిర్వహించారు.

చేగువేరా స్ఫూర్తితో ఉద్యమిద్దాం : డివైఎఫ్ఐ



చేగువేరాకు నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

నిరుద్యోగ యువతకు ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలు కల్పించే వరకూ చేగువేరా స్ఫూర్తితో ఉద్యమిద్దామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. చేగువేరా 97వ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో భాగంగా యువతకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఏడాదికి కోటి ఉద్యోగాలు చొప్పున అవకాశం కల్పిస్తామని చెప్పిందన్నారు. అదేతరహాలోనే రాష్ట్రంలో కూడా ఐదు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, సంవత్సర జాబ్ క్యాలెండర్లను ముందుగానే ప్రకటిస్తామని, నిరుద్యోగ భృతిని ఇస్తామని యువతను మోసం చేశాయన్నారు. యువతను మోసగించిన ప్రభుత్వాలపై ఉపాధి అవకాశాలు కల్పించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని, చేగువేరా స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ, డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు శివరాం, పట్టణ సహాయ కార్యదర్శి రాఖీ, నాయకులు సొహెల్, చందు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

'వొలికలబీడు' నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

డా॥విఆర్ రాసాని కాటికాపరుల గురించి రాసిన 'వొలికలబీడు' నవలను ప్రసిద్ధ అనువాదకురాలు మర్‌ఘట్ పేరుతో అనువదించిన నవలను హైదరాబాద్ రవీంద్ర భారతిలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, దిగంబరకవిత్వకవి నిఖిలేశ్వర్, హిందీ సాహితీవేత్తలు శుక్లా, అహిల్యామిశ్రా, అనువాదకురాలు డా॥వసంతలు ఆవిష్కరించారు. పుట్టినప్పుడు వట్టి చేతులతో పుట్టే మనిషి తిరిగి వట్టి చేతులతోనే పోతాడనీ, కులాలకు మతాలకు అతీతంగా ఆ మనిషికి చివరి వీడ్కోలు పలికే కాటికాపరుల జీవితాలను అద్భుతంగా చిత్రించిన నవల వొలికలబీడు అని పలువురు కొనియాడారు.



వొలికలబీడు నవలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పామిడి వ్యవసాయ అధికారిగా విజయకుమార్



పామిడి : మండల వ్యవసాయ అధికారిగా టిఇ విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లీనా వసుంధర గుంతకల్లు వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మండలంలోని రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. అలాగే మండలంలోని అధికారులు, సిబ్బంది, రైతులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇకపోతే అన్నదాత సుఖీభవ పథకానికి 7,380 మంది రైతులు అర్హులుగా ఉన్నారన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

స్థలం వివాదంలో అన్న చేతిలో తమ్ముడి హత్య

ప్రజాశక్తి-పుట్లూరు

స్థలం విషయంలో నెలకొన్న వివాదం ఓ వ్యక్తి ప్రాణాలను తీసింది. అన్నదమ్ముల మధ్య నెలకొన్న వివాదం తీవ్రం అయ్యి తమ్ముని అన్న హత్య చేశాడు. ఈ ఘటన పుట్లూరు మండల కేంద్రంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పుట్లూరు మండల కేంద్రానికి చెందిన ఓబుళమ్మకు ముగ్గురు కమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కమ్మగిరి, నడిపి కమ్మగిరి(40) మధ్య స్థలం వివాదం నడుస్తోంది. వారసత్వంగా సక్రమంచిన స్థలంలో ఇటీవల పెద్ద కమ్మగిరి ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. అతను నిర్మించిన ఇంటి స్థలంలో తనకూ భాగం ఉందని నడిపి కమ్మగిరి అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సమయంలో తనకు స్థలంలో వాటా ఇవ్వకుంటే చంపుతానంటూ తమ్ముడు నడిపి కమ్మగిరి అన్న పెద్ద కమ్మగిరిని బెదిరించాడు. తనను చంపుతాడన్న భయంతో శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న నడిపి కమ్మగిరిని అన్న పెద్ద కమ్మగిరి చాకుతో గొంతుకోసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ వెంకట నరసింహా పరిశీలించారు. మృతుని తల్లి ఓబుళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.